మినీకథ

# మేలుకోసం మానవత



జొన్నలగడ్డ లలితాదేవి

ఎదురుగా చక్కని డిజైన్లతో తయారైన తన కొట్టును చూసి మనసారా పొంగిపోయాడు మృత్యుంజయరావు.

స్వంతంగా బిజినెస్ చేయాలని-మంచి సెంటర్లో కొట్టు పెట్టుకోవాలని-స్వతంత్రంగా జీవించాలని మృత్యుంజయరావు చిరకాల వాంఛ. తన చేతిక్రింద పదిమంది పనివారుండాలని-పదిమందికి జీవనోపాధి కల్పించాలని కూడా అతను చిన్నప్పటి నుంచీ అనుకుంటూ వుండేవాడు-

అందుకే ఎం.కాం. ప్యాసైన అతన్ని ఏదన్నా బ్యాంకుల్లోనో-గవర్నమెంటు ఆఫీసుల్లోనో పనిచేయమని, దానికి అవసరమైతే ఎందరికాళ్ళన్నా పట్టుకుంటాను- ఎన్ని మొక్కుబడులైనా తీరుస్తాను అంటూ తండ్రి జగదీశ్వరరావు ఇంచుమించు ఏకైక పుత్రరత్నాన్ని కాళ్ళు గడ్డం పుచ్చుకున్నంత పనిచేసి మరీ బతిమాలినా మృత్యుంజయరావు వినలేదు. అసలు వినదలచుకోలేదు కూడా.

"నువ్వు వాటి నిమిత్తం ఖర్చుపెట్టే డబ్బు నాపేర డిపాజిట్ చెయ్యి.బ్యాంకి లోను సంపాదించుకుని స్వతంత్రంగా బతుకుతాను-ఈ మాటకిమట్టుకు ఇంక తిరుగులేదు" అంటూ బల్లగుద్ది మరీ చెప్పాడు.

"పోనీయండి- వున్నది ఒక్కడు- వాడి మనసు కష్టపెట్టి మనం ఏం బావుంటాం? వాడేమన్నా గుర్రప్పందాలకి పోతానన్నాడా-పేకాడతానన్నాడా! లక్షణంగా కొట్టు పెట్టుకుంటానన్నాడు అంతేగా?" అంటూ తల్లి హేమాంబ కొడుక్కు ఫుల్ సపోర్ట్ ఇచ్చింది.

దాంతో ఆడపిల్లలుకూడా అన్నగారివేపే తిరిగిపోయారు-చివరికి మెజారిటీ కోల్పోయిన జగదీశ్వరరావు అందుకు అంగీకరించక తప్పలేదు.

అతని అదృష్టం మంచిదన్నట్లు మంచి సెంటర్లో ఒక కొట్టు గుడ్‌విల్‌కు దొరికింది- అది తీసుకుని తనకు వచ్చిన భంగిమల్లో తీర్చిదిద్దుకున్నాడు-ఇక ఫైనల్ టచింగ్స్ ఆరోజుతో అయిపోతాయి.

షాపు ఓపెనింగ్ అంటూ కార్డులు అచ్చువేయించాడు- ఆ కార్డులు తీసుకుని ముద్దుపెట్టుకుని సంతృప్తిగా నిట్టూర్చాడు మృత్యుంజయరావు.

'ఎల్లుండే తన షాపు ఓపెనింగ్- ఈ రోజు అందరికీ కార్డులు పంచిరావాలి- సరుకులు రేపంతా కొట్లో సర్దించాలి- కొంత సరుకు వుంది- ఇంకా కొంత ఆర్డరిచ్చింది రాత్రికో, రేపుదయానికో దిగుతుంది-దానికి డబ్బు కట్టేరావాలి ఈ రోజు- మొత్తం యాభై వేలు ఇప్పుడు చెల్లించాలి.'

"ఇదుగో-రాజారావు పంపిన 30 వేల చెక్కు క్యాషయింది. అది తీసుకుని-బ్యాంక్‌లో నాపేరన వున్న 20 వేలు కూడా డ్రా చేసి తెచ్చి అక్కడ కట్టేయ్" అంటూ చెక్కురాసిచ్చాడు జగదీశ్వరరావు-

ఆడపిల్ల పెళ్ళికోసం అతను కూడబెట్టిన డబ్బు అది- కొడుకు అవసరం గమనించి ఇచ్చాడు జగదీశ్వరరావు.

ఆ చెక్కు అందుకుని హుషారుగా బ్యాంక్‌కి బయలు దేరాడు మృత్యుంజయరావు. మొత్తం యాభైవేలు డ్రా చేసుకున్నాడు- బ్యాగ్‌లో దాచాడు-'ఇటు పక్కకి ఎలాగో రానే వస్తున్నాను- ఇక్కడ వున్న వాళ్ళందరికీ ఈ కార్డులు పంచేస్తే సరి.' అనుకుంటూ ఓ పది కార్డులు తీసుకునే బయలుదేరాడు.

అటు పక్క అతని మిత్రుల ఇళ్ళు వున్నాయి.

లూనామీద సంతోషంతో ఉరకలు వేస్తూ బయలు దేరాడు బ్యాంకి నుంచి.

టర్నింగ్‌లో ఎదురుగా పెద్ద భూతంలా వస్తోంది లారీ- పక్కకి తప్పుకోవాలంటే సిటీబస్ వస్తోంది-

ఏం జరుగుతుందో- ఏమవుతుందో ఆలోచించే లోగానే అతని లూనా లారీక్రింద పడిపోయింది.

"యాక్సిడెంట్-యాక్సిడెంట్" అంటూ జనం అంతా పోగయ్యారు

బ్యాగ్ చెదిరి డబ్బు కాగితాలు చెల్లాచెదురయ్యాయి. అంతే-యాక్సిడెంట్ అయి విలవిలలాడుతున్న మనిషిని మరిచిపోయారు.

ఎవరి కంటికీ అతని రుధిరధారలు-బాధాపూరిత ఆక్రందనలు కనబడలేదు- వినబడలేదు. వందలు-యాభైలు. చెల్లాచెదురైన కాగితాలను ఒకరిమీదపడి ఒకరు పోటీలతో ఏరుకోసాగారు. పదిహేనువేలు అక్కడికక్కడే హస్తగతం అయ్యాయి.

ఆ ఏరుకునేవారిలో-సామాన్యులున్నారు- రిక్షా వారున్నారు-అంతో ఇంతో విద్యాధికులూ వున్నారు. కాని ఎవరిలోనూ ఈషణ్మాత్రం మానవత మేల్కొలేదంటే ఆ జీవి మరణయాతన గుర్తించలేకపోయారంటే డబ్బుమీద ప్రతి మనిషికీ వున్న ఆశ-తమకం-వ్యామోహమే కారణం.

పోలీసులు వచ్చారు-బ్యాగ్ హ్యాండోవర్ చేసుకున్నారు- అతన్ని కాదు కాదు పోతున్న ప్రాణాన్ని ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

కొడుకు మరణవార్త విని కుప్పకూలిపోయాడు జగదీశ్వరరావు.

బ్యాగ్‌లో వున్న పదివేలు తండ్రికి అప్పగించారు సిన్సియర్‌గా పెద్దలు- ఆ డబ్బు బ్యాగ్ చూసి వికటంగా నవ్వుకున్నాడు మనసుచెదరిన జగదీశ్వరరావు. తన కొడుకుదగ్గర ఎంత డబ్బు వుందో తనకి తెలుసు- ఎంత కాజేశారో తనకి తెలుసు. ఏదో కొడుకు బిజినెస్ పెట్టి లక్షలు ఆర్జిస్తాడని, ఆడపిల్లల పెళ్ళి అప్పుడే చేయవచ్చని బంగారు కలలు కన్నందుకు తన ఆశలన్నీ సంధికొట్టుకుపోయాయి.

"నలభైవేలు పోయాయమ్మా- అన్నయ్య ప్రాణంతో పాటు" అంది ఏడుస్తూ కమల.

"లక్షల విలువచేసే వాడి ప్రాణమే పోగాలేంది నలభై వేలు పోయినందుకు ఎందుకమ్మా దుఃఖం" అంది హేమాంబ- పేరు మృత్యుంజయరావయినా మృత్యువు నెదిరించలేని అల్పాయుష్కుడిని తలచుకుంటూ. సగం సరుకుతో నిండిన కొట్టు- మిగిలిన అప్పు- ఆగిపోయిన ఆడపిల్లల పెళ్ళిళ్ళు- అన్నీ పెద్ద కొండరాళ్ళలా మీద పడ్డాయి జగదీశ్వరరావుకు వృద్ధాప్యంతోపాటు.

'ఆ యాక్సిడెంట్ అవగానే అన్నయ్యని ఏ ఆస్పత్రికి తరలించినా బ్రతికేవాడు! ఒక్కరు కూడా ఆ పుణ్యం కట్టుకోలేకపోయారంటే-"అమ్మా ధనలక్ష్మీ! నీ శక్తి అపారం' అనుకుంటూ కళ్ళు వత్తుకుంది పెళ్ళి ఘడియకోసం ఎదురుచూస్తున్న కమల.